క్లుప్తంగా

చేయూతపై లబ్ధిదారులకు అవగాహన

మందస: చేయూత పథకంతో మహిళలకు ఆర్థిక భరోసా కలుగుతుందని జెడ్పీటీసీ సభ్యురాలు సవర చంద్రమ్మ అన్నారు. మండలంలోని గిరిజన ప్రాంతమైన రాయికోలలో సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు ఆధ్వర్యంలో చేయూత పథకంపై లబ్ధిదారులతో శనివారం అవగాహన సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. నాలుగో విడత చేయూత నిధులతో కిరాణా, గొర్రెలు, కూరగాయలు, వ్యాపారం, డెయిరీ తదితర స్వయం ఉపాధిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. సర్పంచ్ నవిత, వీవోఏ జగబంధు పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ


టెక్కలి: ర్యాలీ చేస్తున్న ఆరోగ్య కార్యకర్తలు

టెక్కలి: ఐదేళ్లలోపు పిల్లలకు విధిగా చుక్కలు మందు వేయించాలని ఆరోగ్య కార్యకర్తలు కోరారు. ఆదివారం నిర్వహించనున్న పల్స్‌పోలియోను విజయవంతం చేయాలని కోరుతూ స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి అవగాహన ర్యాలీని శనివారం నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేస్తూ నినాదాలు చేశారు.

పాఠశాల సందర్శన

కంచిలి: విద్యార్థులకు ఉత్తమ బోధన చేయాలని ఎంఈవో-2 కుంబి చిట్టిబాబు అన్నారు. జలంత్రకోట పంచాయతీ పరిధి చొట్రాయిపురం ప్రాథమిక పాఠశాలను ఆయన శనివారం సందర్శించారు. విద్యార్థుల హాజరు, అసెంబ్లీ జరుగు విధం, సాధన పుస్తకాలు కరెక్షన్, ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్స్, డైరీలు, పాఠశాల రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం అమలులో భాగంగా రాగి జావ రుచిని పరిశీలించి ఇంకా రుచికరంగా ఉండాలని, వంటగది పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని భోజన పథకం సిబ్బందికి సూచించారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.తిరుపతిరావు, సహోపాధ్యాయుడు సీహెచ్ లింగమూర్తి ఉన్నారు.

ఈ-క్రాప్ ముసాయిదా జాబితా ప్రదర్శన

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని 16 రైతు భరోసా కేంద్రాల్లో ఈ-క్రాప్ రబీ-2024 సామాజిక తనిఖీ కోసం ముసాయిదా జాబితాలను శనివారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామ సభల్లో మండల వ్యవసాయాధికారి భార్గవిరెడ్డి ఈక్రాప్ నమోదైన రైతుల జాబితా చదివి వినిపించారు. అభ్యంతరాలు ఉంటే ఆదివారం వరకు పంట నమోదు వివరాలు, సవరణలు రాత పూర్వకంగా తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు దక్కత నూకయ్యరెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పాతిర్ల రాజశేఖరరెడ్డి, సర్పంచ్ చల్లా కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మేరుగు సూర్యనారాయణ ఉన్నారు.

నేత్రపర్వంగా సామూహిక రుద్రాభిషేకాలు


సామూహిక కుంకుమార్చనల్లో మహిళలు

కవిటి: బిగొనపపుట్టుగలోని కాశీవిశ్వనాథ ఆలయంలో శనివారం మహాన్యసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏటా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివమండలదీక్షలు తీసుకున్న స్వాముల పర్యవేక్షణలో రుద్రాభిషేక ఉత్సవాలు వేడుకగా నిర్వహించడం సంప్రదాయం. ఇందులో భాగంగా రుద్రాభిషేకం, పార్వతీదేవికి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

బూత్ కమిటీలు ఏర్పాటు చేయాలి

సోంపేట: అధిష్టానవర్గం ఆదేశాల మేరకు త్వరితగతిన బూత్‌కమిటీలు ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ వైఎస్సార్‌సీపీ మండల నాయకులకు సూచించారు. కొర్లాం గ్రామంలో మండల పార్టీ నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బూత్ కమిటీ సభ్యులను నియమించేటప్పుడు పార్టీ చేసిన సూచనలు తప్పకుండా పాటించాలన్నారు. ఎన్నికలకు పార్టీ శ్రేణులను సిద్ధం చేయాలన్నారు. ఎంపీపీ నిమ్మన దాస్, మండల పార్టీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, జేసీఎస్ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ, నాయకులు కోట్ని శ్రీనివాస్, తామాడ మోహన్, బాలరాజు, బంగారు పాపారావు, సూరాడ పాపారావు ఉన్నారు.

లోక్ అదాలత్ వాయిదా

కోటబొమ్మాళి: ఈ నెల తొమ్మిదో తేదీన జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్ ఈ నెల 16వ తేదీకి వాయిదా పడినట్లు కోటబొమ్మాళి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ నుంచి సమాచారం వచ్చిందన్నారు.

మందస వాసా.. చిరుమందహాసా




దేవదేవుడు కల్పవృక్ష వాహనం అధిరోహించాడు. ఆలయ ఆవరణంతా ఊరేగి ఉత్సవ ఉత్సాహాన్ని రెట్టింపు చేశాడు. మందస వాసుదేవుని బ్రహ్మోత్సవాల్లో క్రతువులన్నీ శాస్త్రోక్తంగా జరుగుతున్నాయి. శ్రీత్రిదండి దేవనాథరామానుజ జీయర్‌స్వామి శనివారం అనుగ్రహ భాషణం చేశారు.

– మందస

మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ తదితరులు

టెక్కలి: రావివలస ఎండల మల్లికార్జునస్వామి దేవస్థానంలో ఈ నెల ఎనిమిదో తేదీన మహాశివరాత్రి సందర్భంగా ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. శివరాత్రి ఉత్సవాల నిర్వాహణపై శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. ఎనిమిది నుంచి 11వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, మంచినీరు, పోలీస్ బందోబస్తు నిర్వాహణ సక్రమంగా ఉండాలన్నారు. దువ్వాడ మాట్లాడుతూ.. ఎంతో చరిత్ర కలిగిన మల్లన్న దేవస్థానంలో శివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్, ఎమ్మెల్సీని సన్మానించి మల్లన్న ఫొటోలను అందజేశారు. అనంతరం మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ సర్లాన సుధాకర్, ఈవో వి.రాధాకృష్ణ, రావివలస సర్పంచ్ సర్లాన బాలకృష్ణ, తహసీల్దారు ఆర్.బాలమురళీకృష్ణ, సీఐ పి.పైడయ్య, అర్చకులు రామకృష్ణ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాలు

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
- ఉప ఖజానా కార్యాలయం ప్రారంభం


ట్రెజరీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అప్పలరాజు

పలాస: ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాలు కట్టించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు చెప్పారు. పలాస తహసీల్దార్ కార్యాలయం వద్ద రూ.1.8 కోట్లతో నిర్మించిన ఉప ఖజానా (సబ్ ట్రెజరీ) కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అద్దె భవనాల ఇబ్బందులు లేకుండా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉద్యోగులు, ప్రజల సౌకర్యార్థం ఈ భవనాన్ని నిర్మించామని చెప్పారు. ఉప ఖజాన సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గత పాలకుల హయాంలో చాలీచాలని సదుపాయాలతో అద్దె కొంపల్లో ప్రభుత్వ కార్యాలయాలు నడిచేవని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థలో ఉద్యోగులు, ప్రజల ఇబ్బందులు తొలగించడానికి కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి కార్యాలయాలు నిర్మించామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ సీహెచ్ రవికుమార్, పలాస ఆర్డీవో డాక్టర్ భరత్‌నాయక్, స్థానిక తహసీల్దార్ ఎస్.ఎస్.వి.ఎస్.నాయుడు, ఎస్టీవో ఎల్.రామారావు, ఏఎంసీ చైర్మన్ పి.వి.సతీష్, పీఏసీఎస్ అధ్యక్షుడు పైల చిట్టిబాబు, నాయకులు సనపల సింహాచలం, దువ్వాడ రవి, శిష్టు గోపి, ఎన్జీవో సంఘం అధ్యక్షుడు బోనెల గోపాల్, విశ్రాంత ఉద్యోగ సంఘ నాయకులు తమ్మినేని మాధవరావు, నెమలపురి అప్పారావు, చింతాడ మాధవరావు, ఎంఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మల కళ్లలో ఆనందం


లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న సాయిరాజ్

ఇచ్ఛాపురం రూరల్: గూడు, నీడ లేని అక్కచెల్లెమ్మల కళ్లలో ఆనందం చూడాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ అన్నారు. ముచ్చింద్ర పంచాయతీ బెన్నుగానిపేటలో 56 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన ఇంటి పట్టాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల్ని ఇంటి హక్కుదారులను చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తే.. దాన్ని ఓర్చుకోలేని టీడీపీ నాయకులు కోర్టులకు వెళ్లి వాటిని నిలుపుదల చేయాలని చూశాలన్నారు. చివరికి న్యాయమే గెలిచి అక్కచెల్లెమ్మల సొంతింటి కలను నిజం చేశారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, జేసీఎస్ కన్వీనర్లు ఆశి పురుషోత్తమరెడ్డి, సాలిన ఢిల్లీ, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దక్కత నూకయ్యరెడ్డి, చినపాన భోగయ్య, సాడి గురుమూర్తి, కాళ్ల జయదేవ్, పిట్ట విశ్వనాథం, రాంపత్ని చిట్టిబాబు, రంగాల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విద్యతోనే ఉత్తమ పౌరులు

- జూనియర్ సివిల్ జడ్జి ఫరీష్‌కుమార్


మాట్లాడుతున్న ఫరీష్ కుమార్

ఇచ్ఛాపురం రూరల్: విద్యతోనే పిల్లలు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని ఇచ్ఛాపురం జూనియర్ సివిల్ జడ్జీ పి.ఫరీష్‌కుమార్ అన్నారు. స్థానిక రూరల్ ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. స్థానికంగా జరిగే సంఘటనల్లో నిరపరాధుల్ని బాధ్యుల్ని చేస్తూ సంఘాల పేరుతో జరిమానాలు, గ్రామ బహిష్కరణలు చేస్తున్న నేపథ్యంలో బాధ్యతాయుతమైన వృత్తిలో ఉండే అంగన్‌వాడీ సిబ్బంది పోలీస్ స్టేషన్, న్యాయ విజ్ఞాన సదస్సుకు సమాచారం అందించాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు విద్యతో పాటు బారికి జాలీ, సహకారం, ప్రేమ, బాధ్యత అనే నాలుగు అంశాలను ప్రాథమిక దశలో నేర్పిస్తే వారు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని అన్నారు. రూరల్ ఎస్సై ఎన్.లక్ష్మణరావు మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నాయని, వాటిని నిరోధించేందుకు తమ వంతు బాధ్యలను నిర్వర్తించాలన్నారు. గృహ హింస, వరకట్నం వంటి వేధింపులు ఉంటే తక్షణమే తమకు సమాచారం అందివ్వాలని అన్నారు. సీడీపీవో పురాణం నాగరాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏసీడీపీవో యాళ్ల లావణ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.దేవరాజురెడ్డి, సీనియర్ అడ్వకేట్లు గిన్ని సీతయ్య, ఎస్.ఎల్.నారాయణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అచ్చెన్న ఇదేం తీరు!



కోటపాడులో నూతన సంవత్సరం సందర్భంగా


శనివారం వారే అచ్చెన్నాయుడు సమక్షంలో టీడీపీ కండువాలతో ఉన్న దృశ్యం

సంతబొమ్మాళి: టీడీపీ వారికే మళ్లీమళ్లీ కండువాలు వేసి పార్టీలోకి అచ్చెన్నాయుడు ఆహ్వానించడంపై వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. సంతబొమ్మాళిలో పలు నాయకులు శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అచ్చెన్న తీరును దుయ్యబట్టారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడుగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసి కూడా సొంతపార్టీ కార్యకర్తలను గుర్తించలేకపోవడం దారుణమన్నారు. పార్టీ కార్యకర్తలే తెలియకపోతే ఓట్లు వేసి గెలిపించిన ప్రజలు ఎలా జ్ఞాపకం ఉంటారని ప్రశ్నించారు. పబ్లిసిటీ కోసం ఇలాంటి పనికిమాలిన పనులు చేసి ప్రజల్లో చులకన కావద్దని హితవు పలికారు. నూతన సంవత్సర వేడుకల్లో మీఫొటో పెట్టి బ్యానర్ కట్టిన కోటపాడు టీడీపీ కార్యకర్తలకే శనివారం పార్టీ కండువా వేసి వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి వచ్చారని ఢంకా కొట్టుకోవడం ఏమిటని ప్రశ్నించారు. చీప్‌ట్రిక్స్ మాని ప్రజలకు ఉపయోగపడే రాజకీయాలు చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ సెక్రటరీ కోత సతీష్, కోటపాడు సర్పంచ్ కోత ఇందిర, ఎంపీటీసీ సభ్యురాలు కోత శ్రీకన్య ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురు చేరిక


పార్టీ కండువాలు వేస్తున్న సాయిరాజ్, నిమ్మన దాస్

సోంపేట: ఉప్పలాం సచివాలయం పరిధిలోని పలు కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో శనివారం చేరారు. ఆర్.తులసీదాస్, జి.లింగరాజు, బట్టి సింహాచలంతో పాటు మరో 10 కుటుంబాల సభ్యులు పార్టీలో చేరగా.. వీరికి సాయిరాజ్, ఎంపీపీ నిమ్మన దాస్ కండువాలు వేసి ఆహ్వానించారు. మండల పార్టీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, జేసీఎస్ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ, సర్పంచ్ బట్టి మాధవరావు, పార్టీ నాయకులు సూరాడ పాపారావు, రాజారావు, పండు, సూకాడ కామేశ్ ఉన్నారు.

సంక్షిప్తంగా...

వైఎస్సార్ విగ్రహావిష్కరణ


వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

కోటబొమ్మాళి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పరిపాలనలో దేశానికే ఆదర్శప్రాయుడుగా నిలిచారని కోటబొమ్మాళి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుగ్గు పుణ్యవతి అన్నారు. స్థానిక రైతుబజార్ ఆవరణలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను పరిచయం చేసిన ముఖ్యమంత్రిగా వైఎస్సార్ గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ కాల్ల సంజీవరావు, ఎంపీటీసీ సభ్యుడు కమ్మకట్టు శ్రీనివాసరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ బొడ్డు వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు రోణంకి మల్లేశ్వరరావు, అన్నెపు రామారావు, సుగ్గు రామిరెడ్డి, దుక్క రామక్రిష్ణ, రంజాన్‌రాజుబాయ్, కల్లి విశ్వనాథరెడ్డి, రాంపాత్రుని శివారెడ్డి, మెట్ట శాంతారావు, ఎ.సురేష్ ఉన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్ఛాపురం: పురుషోత్తపురం ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి.వైకుంఠరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌లో ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం పాఠశాల పనివేళల్లో 91774 58429 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

8న మహా మృత్యుంజయ హోమం

కంచిలి: మహా శివరాత్రి సందర్భంగా సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వానప్రస్థ ఆశ్రమం ఆవరణలో ఈ నెల ఎనిమిదో తేదీన మహా మృత్యుంజయ హోమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు గుళ్ల రమేష్, మోహన్‌లు తెలిపారు. పూజలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న జంటలు 73863 74850, 94905 96331 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మానవతా విలువలు పెంపొందించుకోవాలి

టెక్కలి: విద్యార్థి స్థాయి నుంచి మానవతా విలువలు పెంపొందించుకోవాలని ఆంధ్రా యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు కోలవెన్ను మలయ వాసిని అన్నారు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం 'సాహిత్యంలో మానవతా విలువలు' అనే అంశంపై శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, అధ్యాపకులు కె.వితల్‌రావు, అనిత, కళాశాల పూర్వపు విద్యార్థి, కస్టమ్స్ అధికారి మోహన్‌రావు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరా ప్రారంభం

కాశీబుగ్గ: మున్సిపాలిటీ నిధులతో ఏర్పాటు చేసిన మంచినీటి సరఫరా ట్యాంకర్‌ను స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్ బల్ల గిరిబాబు ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, కౌన్సిలర్ బోనెల రాము, ఏఈ బీర అవినాష్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కవిటి: మండల కేంద్రం కవిటిలో ఏర్పాటు చేసిన నూతన సబ్‌స్టేషన్‌కు రాజపురం సబ్‌స్టేషన్‌తో అనుసంధానం చేసే పనులు జరుగుతున్నాయి. దీంతో కవిటి, ప్రగడపుట్టుగ, కె.కొత్తూరు, గొండ్యాలపుట్టుగ తదితర గ్రామాలకు ఆదివారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు సంబంధిత అధికారులు శనివారం తెలిపారు.

పేదలకు 'పట్టా'భిషేకం

ఇచ్ఛాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే పేదలకు నిజమైన లబ్ధి జరిగిందని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతిదివ్య అన్నారు. మున్సిపాలిటీ 15, 16 వార్డులు లాలాపేట సచివాలయం పరిధిలో 80 మందికి, 18, 19, 20 వార్డులకు సంబంధించి రత్తకన్న సచివాలయం పరిధిలో 53 మందికి ఇంటి పంటాలను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు టెంక లక్ష్మి, చిడిపోతు జగన్నాయకులు, బొబ్బిలి భూదేవి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్ ఉన్నారు.

పేదలకు ఇళ్లపట్టాల పంపిణీ మహత్తర కార్యక్రమం

కవిటి: నిరుపేదలకు ఇళ్లస్థలాల పంపిణీ మహత్తరకార్యక్రమమని పీఏసీఎస్ చైర్మన్ దేవరాజ్‌సాహూ, కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు అన్నారు. శనివారం కవిటి పంచాయితీలో తహసీల్దార్ ఎం లక్ష్మీ,ఎంపీడీఓ కే శ్రీనివాసరెడ్డి జగనన్నకాలనీల్లో ఇంటిస్థలాలు మంజూరుచేసిన లబ్ధిదారులకు పట్టాల్ని పంపిణీని ప్రారంభించారు.

వలంటీర్లకు సత్కారం

సోంపేట: గ్రామవలంటీర్లు అందిస్తున్న సేవలు దేశానికే ఆదర్శమని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ అన్నారు. ఉప్పలాం సచివాలయం పరిధిలో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా శనివారం ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్‌తో కలిసి వలంటీర్లను సత్కరించారు. మండల కమిటీ అధ్యక్షుడు శిలగాన భాస్కరావు, జేసీఎస్ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ, సర్పంచ్ బి.మాధవరావు, నాయకులు రాజారావు, పండు, పాపారావు పాల్గొన్నారు.

బూత్‌లెవిల్ కమిటీలే కీలకం

ఇచ్ఛాపురం రూరల్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేందుకు గ్రామస్థాయిలో బూత్‌లెవిల్ కమిటీలే కీలకమని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ అన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో మండలంలోని బూత్ కన్వీనర్లు, గృహ సారథులతో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, మండల పార్టీ కన్వీనర్ పాతిర్ల రాజశేఖరరెడ్డి, నియోజకవర్గ బూత్ కమిటీల అధ్యక్షుడు రాంపత్ని చిట్టిబాబు ఉన్నారు.

మంచినీటి కష్టాలకు చెక్

వజ్రపుకొత్తూరు రూరల్: చినవంక పంచాయతీ గుళ్లలపాడులో ఏళ్ల తరబడి మంచి నీటి సమస్య వేధిస్తుండటంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.9 లక్షల వ్యయంతో గ్రామంలో మంచి నీటి పథకాన్ని ఏర్పాటు చేయడంతో నీటి కష్టాలు తీరాయి. మంచి నీటి పథకాన్ని వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బగాతి శ్రీకాంత్ ఆధ్వర్యంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్య నాయుడు శనివారం ప్రారంభించారు.

ప్రజాగ్రంథాలయానికి భూమిపూజ

కాశీబుగ్గ: మున్సిపాలిటీ 20వ వార్డు లేబరు కాలనీలో ప్రజా గ్రంథాలయానికి శనివారం భూమి పూజ జరిగింది. ప్రజలంతా కలిసి చందాలు వేసుకుని గ్రంథాలయం నిర్మాణానికి ముందుకు రాగా.. వార్డు కౌన్సిలర్ అంబటి మాధురి భూమిపూజ చేశారు. వార్డు ఇన్‌చార్జి అంబటి ఆనందరావు, ధర్మాపు విజయకుమార్, బొంపల్లి జయమ్మ, గజ్జి బాలయ్య ఉన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట

కవిటి: శిలగాం పంచాయతీ కొత్రాయిపుట్టుగలో శనివారం ఆంజనేయస్వామి విగ్రహప్రతిష్ట వైభవంగా జరిగింది. ఎమ్మెల్సీ నర్తు రామారావు ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కొజ్జీరియా అభయాంజనేయ స్వామి ఆలయ అర్చకులు పెంట శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

గ్రామ పంచాయితీ కార్యాలయం, టెక్కలి

రేఖా నెం. 40/2024/ఏ, తే. 02.03.2024 ది.

బహిరంగ వేలం ప్రకటన

టెక్కలి గ్రామ పంచాయితీకి చెందిన ఈ దిగువ తక్తాలో చూపిన గుత్తలు 2024-25 సం॥నకు మాత్రమే అనగా తే 01.04.2024 ది నుండి తే 31.03.2025 ది వరకు ఆశీల్లు వసూళ్ళు చేసుకొనేందుకు మరియు అనుభవించుకొనుటకై గుత్త హక్కు ఇచ్చుటకు గూర్చి. తే 07.03.2024 దీ గురువారం ఉదయం 11.00 గంటలకు టెక్కలి గ్రామ పంచాయతీ కార్యాలయ అవరణలో కార్యదర్శి/ సర్పంచ్/ EOPR & RD వారిచే గాని లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలం పాట నిర్వహించబడును. వేలం పాటలో పాల్గొనదలచిన వారు శ్రీ డివిజనల్ పంచాయితీ అధికారి, టెక్కలి వారి (అప్ సెట్ ప్రైస్)కు తక్కువ కాకుండా మరియు పంచాయితీ వారి షరతుల ఆమోదంకు లోబడి పాట సమయమునందు నగదు రూపంలో ధరావత్తు మరియు సాల్వెన్సీ ధృవపత్రము ఈ క్రింద తక్తాలో చూపిన విధముగా కార్యనిర్వహణాధికారి/ పంచాయితీ కార్యదర్శి వారికి కాని వారి అనుమతి పొందిన వారికి కానీ అందజేసి ఈ దిగువ పట్టికలో చూపిన విధముగా ఆయా గుత్తలకు నిర్ణీత వేలంపాట ధరావత్తులు చెల్లించి వేలంపాటలో పాల్గొనవలెను.

తక్తా

వ.నెం.	గుత్త వివరము	చెల్లించవలసిన నిర్ణీత ధరావత్తు
1	రోజువారి మార్కెట్లు	రూ. 1,00,000/- లు
2	వారపు సంత	రూ. 10,000/- లు
3	బస్సు మరియు కార్లు స్టాండు	రూ. 20,000/- లు
4	కమేళా	రూ. 10,000/- లు

గ్రామ పంచాయితీ సర్పంచ్ వారి కుటుంబ సభ్యులు కానీ/ మరియు పాలకవర్గ సభ్యులు కానీ గ్రామ పంచాయితీకి ఏ విధమైన బకాయి ఉన్ననూ వేలం పాటలో పాల్గొనుటకు అనర్హులు. ఇతర వివరములకు కార్యాలయం పనిచేయు వేళలో వచ్చి అడిగి తెలుసుకొనవలెను.

నోట్: వేలాం పాట రద్దు పరచుటకు గానీ, వాయిదా వేయుటకు గానీ ఈ పంచాయితీకి పూర్తి అధికారం కలదు. వేలం పాట ఖరారు పంచాయితీ వారి ఆమోదమునకు లోబడి యుండును.

సం/- బత్తుల మల్లేశ్వరరావు, పంచాయితీ కార్యదర్శి,
గ్రామపంచాయితీ - టెక్కలి

రేఖా నెం. 40/2024/ఎ. తే 02/03/2024 ది. గ్రామపంచాయితీ కార్యాలయం, టెక్కలి

బహిరంగ వేలం ప్రకటన

టెక్కలి గ్రామ పంచాయితీకి చెందిన ఈ దిగువ తక్తాలో చూపిన షాపు గదులను 2024-25 సం॥నకు మాత్రమే అనగా తే 01.04.2024ది నుండి తే 31.03.2025ది వరకు అద్దెకు ఇచ్చుట కొరకు బహిరంగ వేలం పాటలు నిర్వహించుట గూర్చి.

తే 07/03/2024 దీ గురువారం మధ్యాహ్నం 3:00 గంటలకు టెక్కలి గ్రామ పంచాయితీ కార్యాలయ అవరణలో కార్యదర్శి/సర్పంచ్ EO,PR&RD వారిచే గాని లేదా వారి అనుమతి పొందిన వారిచేగాని బహిరంగ వేలం పాట నిర్వహించబడును.

వేలం పాటలో పాల్గొనదలచినవారు శ్రీ డివిజనల్ పంచాయితీ అధికారి, టెక్కలి వారి (అప్ సెట్ ప్రైస్)కు తక్కువ కాకుండా మరియు పంచాయితీ వారి షరతుల ఆమోదంకు లోబడి పాట సమయమందు నగదు రూపంలో ధరావత్తు మరియు సాల్వెన్సీ ధృవపత్రము ఈ క్రింద తక్తాలో చూపిన విధముగా కార్యనిర్వహణాధికారి/ పంచాయితీ కార్యదర్శి వారికి కాని వారి అనుమతి పొందిన వారికి కాని అందజేసి ఈ దిగువ పట్టికలో చూపిన విధముగా ఆయా షాపు గదులకు నిర్ణీత వేలం పాట ధరావత్తులు చెల్లించి వేలం పాటలో పాల్గొనవలెను.

తక్తా

వ.నెం.	షాపు నెం.	చెల్లించవలసిన నిర్ణీత ధరావత్తు
1	షాపు నెం.25	రూ.10,000/-
2	షాపు నెం.26	రూ.10,000/-
3	షాపు నెం.27	రూ.10,000/-
4	షాపు నెం.28	రూ.10,000/-
5	షాపు నెం.29	రూ.10,000/-
6	షాపు నెం.30	రూ.10,000/-
7	షాపు నెం.31	రూ.10,000/-
8	షాపు నెం.32	రూ.10,000/-
9	షాపు నెం.33	రూ.10,000/-
10	షాపు నెం.34	రూ.10,000/-
11	షాపు నెం.35	రూ.10,000/-
12	షాపు నెం.36	రూ.10,000/-
13	షాపు నెం.37	రూ.10,000/-
14	షాపు నెం.38	రూ.10,000/-

గ్రామ పంచాయితీ సర్పంచ్ వారి కుటుంబ సభ్యులు కానీ మరియు పాలకవర్గ సభ్యులు కానీ గ్రామపంచాయితీకి ఏ విధమైన బకాయి ఉన్ననూ వేలం పాటలో పాల్గొనుటకు అనర్హులు. ఇతర వివరములకు కార్యాలయం పనిచేయు వేళలో వచ్చి అడిగి తెలుసుకొనవలెను.

నోట్: వేలం పాట రద్దు పరచుటకు గానీ, వాయిదా వేయుటకు గానీ ఈ పంచాయితీకి పూర్తి అధికారం కలదు. వేలాం పాట ఖరారు పంచాయితీవారి ఆమోదమునకు లోబడి యుండును.

సం/- బత్తుల మల్లేశ్వరరావు, పంచాయితీ కార్యదర్శి,
గ్రామపంచాయితీ - టెక్కలి